

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న చిరు వ్యాపారులు

# వీధి వ్యాపారుల ధర్నా

ఎదులాపురం, ఏప్రిల్ 7 : శివాజీ, అంబేద్కర్, గాంధీ చౌక్‌లలో వ్యాపారం చేసుకుంటున్న వారికి గణేశ్ థియేటర్ స్థలంలో చిరు వ్యాపారాలు చేసుకోవడానికి అవకాశం ఇస్తున్నారని, కానీ.. శాశ్వత మార్గం చూపాలని వీధి వ్యాపారులు వివిధ పార్టీల నాయకులతో కలిసి సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా వ్యాపారం చేసుకుంటున్నామని, మాకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. గతంలో కూడా గణేశ్ థియేటర్ వద్ద స్థలం ఇచ్చిన అధికారులు తరువాత వారిని అక్కడి నుంచి పంపించి ఇతరులకు లీజుకు ఇచ్చారని గుర్తు చేశారు. అధికారులు మారుతుంటారని, వారి నిర్ణయాలు వీధి వ్యాపారం చేసుకునే వారికి న్యాయం జరిగేలా ఉండాలని సూచించారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్, ఆయా పార్టీ నాయకులు పత్తి ముజ్జు, సిరాజ్ ఖద్రి, షౌకత్ అలీ పాల్గొన్నారు.

## ముగిసిన చెస్ పోటీలు





చెస్ ముగింపు పోటీల్లో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

బాసర, ఏప్రిల్ 7 : బాసర ఆర్జీయూకేటీలో ఆదివారం ప్రారంభమైన చెస్ పోటీలు సోమవారం ముగిసినట్లు ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు. గ్రామీణ యువతలో చెస్ ఆటపై ఆసక్తిని పెంపొందించాలనే లక్ష్యంతో చెస్ నెట్‌వర్క్ సంస్థ, గ్యాప్ స్కిల్స్ లెర్నింగ్ సొల్యూషన్స్ మద్దతుతో ఈ టోర్నీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ ఏ. గోవర్ధన్, ఓఎస్డీ మురళీదర్శన్, ఏవో రణధీర్ సాగిలు సమావేశానికి హాజరై మాట్లాడారు. సుమారు 200 మంది విద్యార్థులు ఈ చెస్ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు రూ. 26వేల నగదుతోపాటు చెస్ బోర్డులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెస్ నెట్‌వర్క్ ప్రతినిధులు సంజయ్ గుజ్జల, హరిశ్రేరామోజు, రాజన్న, కిరణ్ మర్రెడ్డి, ఆర్జీయూకేటీ స్పోర్ట్స్ అధికారులు ప్రభాకర్‌రావు, పీడీ శ్యాంబాబు, పీఈటీలు వసంత పాల్గొన్నారు.

## రోగులకు వైద్యం అందించాలి



ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 7 : రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం నిర్మల్ మాతా, శిశు ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని ఎస్ఎన్‌సీయూ, పోస్ట్ ఆపరేషన్, ఇంజక్షన్ వార్డులను పరిశీలించి రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి హెచ్‌వోడీ సరోజ, నర్సింగ్ సూపరింటెండెంట్ ధనలక్ష్మి పాల్గొన్నారు.



ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో సౌకర్యాలు లేని ఎడ్ల అంగడి

# ఆదాయమే తప్పా.. సౌకర్యాలు పట్టవా?

### ఆదిలాబాద్ మార్కెట్ యార్డు అంగడిలో సౌకర్యాలు కరువు

- 41 డిగ్రీల మండుటెండలోనూ రైతులు, మూగజీవాల అవస్థలు

ఆదిలాబాద్, ఏప్రిల్ 7(నమస్తే తెలంగాణ) : ఎండలు మండుతున్నాయి. సోమవారం 41 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ మార్కెట్ యార్డు నంబర్-2 ఆవరణలో ప్రతి సోమవారం ఎడ్ల అంగడి జరుగుతుంది. ఈ అంగడికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి రైతులు ఎడ్లను అమ్మడానికి, కొనుగోలు వాహనాల్లో తీసుకొస్తారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విక్రయాలు కొనసాగుతాయి. వందల సంఖ్యలో ఎడ్లను వాహనాల్లో తీసుకొస్తారు.. కరీంనగర్ జిల్లాతో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన రైతులు తమకు కావాల్సిన పశువులను కొనుగోలు చేసి తీసుకెళ్తారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ అంగడిలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. రైతులు, పశువులకు తాగునీటి సౌకర్యం, నీడ, రైతులు సేద తీరడానికి వసతులు కల్పించాలి. తమకు కావాల్సిన ఎడ్ల కోసం మార్కెట్ యార్డు కలియతిరిగి ఎండవేడితో అలసిపోతారు. వేడిని భరించలేక రైతులు ఎడ్లబండ్లకు కవర్లు కట్టుకుంటు ఉపశమనం పొందుతున్నారు. కనీసం మంచినీటి సౌకర్యం లేకపోవడంతో వాటర్ బాటిళ్లను కొనుగోలు చేస్తున్నారు. మూగజీవాలు మాత్రం మండుటెండలో విలవిలలాడుతున్నాయి. పశువుల అమ్మకాలు, కొనుగోళ్లలో ఫీజు వసూలు చేస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారులు పశువుల సంతలో కనీస సౌకర్యాల కల్పించాలని రైతులు కోరుతున్నారు.







ఎండవేడికి తట్టుకోలేక కవర్లు కట్టుకున్న రైతులు



గుడిహత్నూర్‌లో కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# హామీలిచ్చి మర్చిపోవడం వెన్నతో పెట్టిన విద్య

గుడిహత్నూర్, ఏప్రిల్ 7 : ఎన్నికల వేళ హామీలిచ్చి అధికారం చేతికొచ్చాక మర్చిపోవడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ విమర్శించారు. గుడిహత్నూర్ మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో పాల్గొని మాట్లాడారు. లక్షతోపాటు తులం బంగారం ఇస్తామని చెప్పి ఎగ్గొట్టడం మరిచిపోలేరని, రాబోయే స్థానిక ఎన్నికల్లో ఓటుతో కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతారన్నారు. రైతుబంధు, పింఛన్ పెంచుతామని హామీ ఇచ్చి అమలు చేయకుండా కాలయాపన చేయడం సిగ్గు చేటన్నారు. 50 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కవితారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుమల్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు సంజీవ్ ముండె, జాదవ్ భీంరావ్, సర్పే సోంబాయి, శగీర్, గఫార్, ససానే సిద్ధార్థ్, జమీర్, జమీల్, రాందాస్ పాటిల్, ప్రశాంత్ పాల్గొన్నారు.



కడెం వాగులో అడుగంటిన భూగర్భజలం

# పాతాళంలో జలం.. ఎండిన మొక్కజొన్న..

పెంబి, ఏప్రిల్ 7: పెంబి మండలంలోని పస్పుల గ్రామంలో చెక్‌డ్యాంలో సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. ఈ రైతులకు కడెం వాగే జీవనాధారం. దీంతో రెండేండ్లీ క్రితం రెండు పంటలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ ప్రభుత్వం కడెం వాగుపై చెక్‌డ్యాంను నిర్మించింది. ఇక్కడి రైతులు చెక్‌డ్యాంలో మోటార్లు బిగించుకుని సాగునీరు అందిస్తున్నారు. ప్రస్తుతం చెక్‌డ్యాంలో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. దీంతో చెక్‌డ్యాం ఆయకట్టు పరిసర ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయి. ఈ గ్రామానికి చెందిన గుగ్లావత్ ప్రవీణ్ తనకున్న మూడెకరాల్లో మొక్కజొన్న వేశాడు. కడెం వాగులో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో పంట ఎండిపోతుందని రైతు ఆవేదన చెందుతున్నాడు. పంట పెట్టుబడికి ఎకరాకు రూ.15 వేల చొప్పున మొత్తం రూ.45 వేలు పెట్టుబడి పెట్టినట్లు తెలిపాడు. ప్రభుత్వం ఆదుకుని ఎండిన పంటకు నష్టపరిహారం అందించాలని కోరుతున్నాడు.



పస్పుల గ్రామంలో ఎండుతున్న మొక్కజొన్న



వానకాలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు సెంటర్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్(ఫైల్)

# యాసంగి కొనుగోళ్లకు రెడీ

- దొడ్డు, సన్న రకాలకు వేరు వేరుగా కేంద్రాలు
- సమస్యగా మారనున్న గన్నీ బ్యాగుల సేకరణ

ధాన్యం విక్రయాలు ఇలా..

| | |
|---|---|
| కొనుగోలు కేంద్రాలు | 318 |
| సన్నరకం కేంద్రాలు | 119 |
| దొడ్డు రకం కేంద్రాలు | 199 |
| వరి సాగు | 1,17,085 |
| దిగుబడి అంచనా | 1.83 లక్షల మెట్రిక్ టన్నులు |
| కొనుగోలు లక్ష్యం | 1,62,414 మెట్రిక్ టన్నులు |
| సన్న రకం దిగుబడి | 24 వేల మెట్రిక్ టన్నులు |
| దొడ్డు రకం దిగుబడి | 1.38 లక్షల మెట్రిక్ టన్నులు |
| సాధారణ రకం ధర | రూ.2,300 |
| గ్రేడ్-ఏ ధర (క్వింటాలు) | రూ.2,320 |

నిర్మల్, ఏప్రిల్ 7(నమస్తే తెలంగాణ) : యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ప్రారంభించేందుకు యంత్రాంగం సిద్ధమవుతున్నది. సన్నరకం, దొడ్డు రకం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు వేరువేరుగా సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. ఇటీవలే కలెక్టర్ అభిలాష అభినవ్ కూడా కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలని ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. కేంద్రాల నిర్వాహకులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చి సెంటర్లను ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో మంగళవారం నుంచి శిక్షణ ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తం గా ఇప్పటి వరకు కోతలు ప్రారంభం కాలేదు. మరో రెండు వారాల్లో లోకేశ్వరం, కుంటాల, సారంగాపూర్, లక్ష్మణచాంద మండలాల్లో కోతలు ఊపందుకుని ధాన్యం కేంద్రాలకు చేరే అవకాశం ఉన్నది.

### గన్నీ బ్యాగుల కొరత

గన్నీ బ్యాగుల కొరత ప్రధాన సమస్యగా మారింది. 40 లక్షల వరకు గన్నీ బ్యాగులు అవసరమవుతాయి. ప్రస్తుతం జిల్లాలో కేవలం 12.60 లక్షలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వచ్చే పది రోజుల్లో దాదాపు 28 లక్షల గన్నీ బ్యాగులను సేకరించడం అధికారులకు సవాల్‌గా మారనున్నది. గన్నీ బ్యాగుల సేకరణ ఆలస్యమైతే కొనుగోళ్ల ప్రక్రియకు ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మి ల్లులకు కస్టమ్ మిల్లింగ్ కోసం తరలించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చి విక్రయించిన రైతులకు సకాలంలో వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడనున్నారు. కాగా.. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పిస్తామని, కొనుగోలు కేం ద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ కిశోర్ కుమార్ తెలిపారు.

## బావిని బాగు చేయరూ..



బావిలో ప్లాస్టిక్ డబ్బలతో నీటిని తొడుకుంటున్న గ్రామస్తులు

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 7 : మండలంలోని బోస్రాలో 200 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. భూగర్భజలాలు అడుగంటాయి. మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడం, బోర్లు వేసినా నీళ్లు పడకపోవడంతో గ్రామస్తులు పురాతన బావి మీదనే ఆధారపడుతున్నారు. ఈ బావి ప్రమాదకరంగా ఉండడంతో నీటిని తోడుకోవడం కష్టంగా మారింది. గ్రామంలోని పురాతన బావిని బాగు చేసి గ్రామంలో పైపులైన్‌తో నీటిని అందిస్తే సరిపడా నీళ్లు అందుతాయని గ్రామస్తులు అంటున్నారు. అధికారులు స్పందించి బావిని బాగు చేసి నీటిని అందించే విధంగా చూడాలని కోరారు.



మిషన్ భగీరథ నీళ్లు సరిపోకపోవడంతో బావి నీటిని తీసుకెళ్తున్న గ్రామస్తులు



ప్రజావాణిలో దరఖాస్తులు తీసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

# ప్రజావాణికి 111 దరఖాస్తులు

### అర్జీలు స్వీకరించిన ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్, ఏప్రిల్ 7(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ కలెక్టర్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ రాజర్షి షా దరఖాస్తులను స్వీకరించారు. భూములు, పింఛన్లు, విద్య, వైద్యం, మున్సిపాలిటీ, విద్యుత్, ఇతర శాఖల్లోని సమస్యలపై 111 దరఖాస్తులు వచ్చాయి. వివిధ శాఖల అధికారుల వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

### ప్రజల సమస్యలను పరిష్కరించాలి

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 7 : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. నిర్మల్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. శాఖలవారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి ఎంపీడీవో కార్యాలయాల్లో ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులను స్వీకరించాలన్నారు. టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

### బతికున్నా.. చనిపోయినట్టు చూపుతున్నారు..



*నా భర్త మల్లేశ్‌కు 2022లో వృద్ధాప్య పింఛన్ రెండు నెలలు మాత్రమే వచ్చింది. ఆ తర్వాత రాలేదు. పింఛన్ ఎందుకు వస్తలేదని ఎంపీడీవోను అడిగితే ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు కావడంతో వస్తలేదని అన్నారు. ఆన్‌లైన్‌లో డెత్ అని వస్తుందని సిబ్బంది చెబుతున్నారు. సిబ్బంది తప్పిదంతో పొరపాటు వల్ల నా భర్తకు పింఛన్ నిలిచింది. పింఛన్ ఇప్పించాలని ఖానాపూర్ ఎమ్మెల్యేతోపాటు కలెక్టర్, ఎంపీడీవోను కలిసినా ఫలితం లేదు. మరోసారి కలెక్టర్‌ను కలిసి మా సమస్య చెప్పుకుందామని ప్రజావాణికి వచ్చి దరఖాస్తు ఇచ్చా. బతికి ఉన్న మనిషిని చనిపోయినట్లు చూపించి పింఛన్ ఇవ్వకపోవడం అన్యాయం. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా సమస్యను పరిష్కరించాలి.*

**- సత్తవ్వ, ఉట్నూర్**